సాక్షి
పల్నాడు
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,8015 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 33,572 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 588.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నృసింహస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం



మంగళగిరి: దసరా ఉత్సవాలతో పాటు ఆదివారం కావడంతో మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: అమరావతిలోని శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ అన్నపూర్ణాదేవి అలంకార విశిష్టతను వివరించారు. సకల దానాల్లో కెల్లా విశిష్టమైనది అన్నదానమని, లోకాలకు క్షుదార్తి తీర్చే మాత స్వరూపమే అన్నపూర్ణ అవతార పరమార్థమని తెలిపారు. అమ్మవారి అక్షయపాత్రలో కరుణ, ప్రేమ, దయ అనంతంగా ఉంటాయని భక్తులు విశ్వసిస్తారని పేర్కొన్నారు. లోక పోషకురాలైన అన్నపూర్ణాదేవి రూపంలో బాలాచాముండికాదేవిని దర్శిస్తే కాశీని దర్శించినంత పుణ్యం లభిస్తుందని తెలిపారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీ కోదండ రామస్వామి దేవస్థానాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు.

మద్యం షాపులకు 507 దరఖాస్తులు



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఆదివారం వరకు 507 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... గుంటూరులోని 106 షాపులకు 299, పల్నాడు జిల్లాలో 92 షాపులకు 208 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



నగరంపాలెం: జిల్లాలోని ప్రజలు ఊరెళ్లినప్పుడు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా ఇళ్లల్లో చోరీలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మొబైల్ యాప్ సేవలు ఉచితమని, వివరాలకు 86888 31503, 86888 31504, 86888 31568 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి ఎకరాకూ నీరు అందించడమే లక్ష్యం



అద్దంకి రూరల్: సాగర్ ఆయకట్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు అందించటమే లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం అద్దంకి బ్రాంచ్ కెనాల్ 18/0ను ఎన్ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ కాలువలో పేరుకుపోయిన చెత్త, సిల్టు పూడిక తీయించాలన్నారు. షట్టర్లు లేని చోట షట్టర్లు ఏర్పాటు చేయాలని కాలువ పరివాహక ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తిచేయాలని ఎన్ఎస్పీ అధికారులను ఆదేశించారు. నీరు వృథా కాకుండా కెనాల్ ద్వారా ఎగువ పొలాలకు సైతం నీరు అందేలా చూడాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పోలిరెడ్డి ప్రాజెక్టు భూసేకరణ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాదిలోపు కొరిశపాడు రిజర్వాయర్‌ను నీటితో నింపుతామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కల్పవల్లి.. వాత్సల్యరూపిణి..

లలితాత్రిపురసుందరిగా దుర్గమ్మ దర్శనం



అమ్మవారికి కుంకుమార్చన

కల్పవల్లి.. వాత్సల్యరూపిణి అయిన శ్రీలలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తుల జేజేలు అందుకున్నారు. శ్రీదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై జగజ్జనని దర్శనానికి బారులు తీరిన భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి. భక్తుల కొంగు బంగారం, శ్రీచక్ర అధిష్టాన దేవత లలితా త్రిపుర సుందరిని కనులారా దర్శించుకున్నారు. దేవస్థాన ప్రాంగణంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్జిత సేవల్లో ఉభయ దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం నగరోత్సవం కన్నులపండువగా జరిగింది.

- ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు
- అందరి వద్ద వీఐపీ దర్శన టికెట్లు
- సామాన్య భక్తులకు చుక్కలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కోరిన కోర్కెలు తీర్చే కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం లలితాత్రిపురసుందరిగా పూజలందుకున్నారు. తెల్లవారుజాము నాలుగు నుంచి రాత్రి 11 గంటల వరకు క్యూలైన్‌లో భక్తుల రద్దీ ఏకరీతిన కనిపించింది. సుమారు 80 వేల నుంచి 90 వేల మంది భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. తెల్లవారుజాము 4 గంటలకు శ్రీలలితాత్రిపురసుందరీదేవి అలంకరణ, నిత్య పూజలు, ఆలయ అధికారుల తొలి దర్శనం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300 టికెట్ల క్యూలో బారులు తీరారు. రూ. 500 వీఐపీ దర్శన టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు చుక్కలు కనిపించాయి. ఉదయం ఆరు గంటలకు క్యూలైన్‌లోకి వచ్చిన భక్తులు కొండ దిగే సరికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. గంటల తరబడి క్యూలైన్‌లో చిన్న పిల్లలతో ఉన్న తల్లిదండ్రులు అధికారులను నిలదీశారు.



క్యూ లైన్‌లో భక్తులు



నగరోత్సవంలో ఉత్సవమూర్తులు

అందరి వద్ద వీఐపీ టికెట్లు

ఉదయం 7 గంటల నుంచే దుర్గగుడికి వీఐపీల తాకిడి కనిపించింది. ప్రజాప్రతినిధులు, సేవా కమిటీ సభ్యుల సిఫార్సులతో ఆలయానికి చేరుకుంటున్న భక్తులు నేరుగా చిన్న గాలిగోపురం మీదుగా ఆలయంలోకి చేరుకుని అరగంటలో వెలుపలకు వచ్చేస్తున్నారు. దీంతో గంటల తరబడి రూ. 500 క్యూలైన్‌లో ఉన్న భక్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. సామాన్య భక్తులకే అమ్మవారి దర్శనంలో ప్రాధాన్యమని అధికారులు చెబుతున్న మాటలు, ఆలయంలో అమలు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అమలు కాని టైం స్లాట్

వీఐపీలకు రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టైం స్లాట్ ఏర్పాటు చేశామని సీపీ రాజశేఖర్ బాబు, కలెక్టర్ సృజన ప్రకటించారు. అయితే ఆదివారం టైం స్లాట్ పూర్తిగా విఫలమైంది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు వీఐపీల పేరుతో దర్శనాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోని ప్రొటోకాల్ కార్యాలయం, లక్ష్మీగణపతి విగ్రహంతో పాటు చిన్న గాలి గోపురం వద్ద వందల సంఖ్యలో వీఐపీ టికెట్ల పట్టుకుని రాజమార్గంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరి కనిపించారు. అసలు వీఐపీ టికెట్లు ఎన్ని విక్రయించారనే దానిపై దేవస్థానం వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఒకే టికెటును పదుల సంఖ్యలో జిరాక్స్‌లు తీసి దర్శనాలు చేసుకుంటున్నారని ఆలయ అధికారులు గుర్తించారు. మరో వైపున పోలీసులు సైతం భక్తుల వద్ద దర్శన టికెట్లు ఉన్నాయా.. లేదా? అని అడిగిన తర్వాతే ముందుకు అనుమతించారు.

ఆర్జిత సేవలకు పెరిగిన రద్దీ

ఉత్సవాల్లో ఉభయదాతల సంఖ్య పెరిగింది. ఆదివారం తెల్లవారుజామున మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన ఖడ్గమాలార్చనలో 11మంది, శ్రీచక్రనవార్చనలో 10 మంది, చండీహోమంలో 62 మంది, ప్రత్యేక కుంకుమార్చన మొదటి షిఫ్టులో 97 మంది, రెండో షిఫ్టులో 116 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల టికెట్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించడం, టికెట్ల నంబర్లను దేవస్థానం రిజిస్టర్‌లో సరి చూసుకుంటుండటంతో రెండో రోజులుగా నకిలీ టికెట్ల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. ఇదే సమయంలో వీఐపీ దర్శన టికెట్ల జిరాక్స్‌ల సంఖ్య రెట్టింపైందని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు.



- దసరా ఉత్సవాల్లో తొలి నాలుగు రోజుల్లో సుమారు నాలుగు లక్షల వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసినట్లు దుర్గగుడి ఇంజినీరింగ్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాలు ఇంకా ఐదు రోజులు ఉండగా దేవస్థానం వద్ద 8.64 లక్షల వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

దుర్గ గుడిపై నేడు

- తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరుస్తారు
- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6.30 నుంచి మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

అమ్మవారి నివేదనలు ఇలా

- తెల్లవారుజామున 3 గంటలకు బాలభోగ నివేదన
- ఉదయం 6 గంటలకు చిత్రాన్నం నివేదన
- ఉదయం 10.30 గంటలకు రాజభోగ నివేదన
- మధ్యాహ్నం 12 గంటలకు పంచభోగ నివేదన
- సాయంత్రం 4 గంటలకు విశేష భోగ నివేదన
- సాయంత్రం 6.30 గంటలకు మహా నివేదన

స్టాక్ నిల్.. డిమాండ్ ఫుల్

- మాదిపాడు స్టాక్ పాయింట్‌లో తరిగిపోతున్న నిల్వలు
- మరో రెండు, రోజుల్లో ఖాళీ
- ఆగిపోయిన ఆన్‌లైన్ సేవలు
- ఇప్పటికే బుక్ చేసుకున్న వారు పడిగాపులు

అచ్చంపేట: ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు అడ్డాగా మారనుంది. వినియోగదారులకు సరిపడా అందించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది. జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్స్ ఉండగా , ఐదింటిలో అయిపోయింది. ఒక్క అచ్చంపేట మండలంలోని మాదిపాడు స్టాకు పాయింట్‌లో మాత్రమే ఉంది. ఇక్కడ నుంచి రోజూ 40 లారీలకు పైగా ఇసుకను పలు ప్రాంతాలకు సరఫరా చేస్తుండటంతో నిల్వలు తరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఐదు వేల టన్నుల్లోపు మాత్రమే మిగిలింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. వారందరికీ సరఫరా చేయాలంటే కనీసం 10వేల టన్నుల ఇసుక అవసరం. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికే దొరకనప్పుడు కొత్తగా కావాల్సిన పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

అక్రమార్కులకు అవకాశం

ఇప్పటివరకు స్టాకు పాయింట్లలోనే ఇసుక దొరకడంతో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులు అష్టకష్టాలు పడి తెచ్చుకున్నారు. ఇకపై కావాల్సిన వారు తమ నిర్మాణాలను ఆపుకోలేక పక్కదారులు వెతుక్కోనున్నారు. అదే అవకాశంగా భావించిన అక్రమార్కులు పలు ఇసుక రీచ్‌లలో అక్రమ తవ్వకాలు ఇప్పటికే తెరలేపారు. ట్రక్కును రూ. 4వేల నుంచి రూ.5వేల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో టన్ను ఇసుక ధరను తవ్వకాలకు, నది నుంచి స్టాక్ పాయింట్‌కు తరలించినందుకు, కూలీలకు మొత్తం కలిపి ప్రభుత్వం రూ.192గా నిర్ణయించింది. ట్రాక్టరుకు మూడు టన్నుల చొప్పున స్టాక్ పాయింట్ వద్ద ఇప్పటి వరకు రూ. 452లకు విక్రయించారు. స్టాక్ పాయింట్లలో ఇసుక పూర్తిగా అయిపోకముందే అక్రమార్కులు వేరే దారులకోసం తాపత్రయపడుతున్నారు. చామర్రు, తాడువాయి, చింతపల్లి, కోగంటివారిపాలెం, కోనూరు తదితర గ్రామాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్లు, తవ్వుతున్న పొక్లెయినర్స్ స్టేషన్‌లో 10కి పైగా ఉన్నాయి. వీటిపై కేసులు కూడా నమోదైనట్లు పోలీసుల చెబుతున్నారు.



మాదిపాడు స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉన్న ఇసుక



పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

అక్రమార్కులకు వదిలేస్తారా?

స్టాక్ పాయింట్లలో నిల్వలు అయిపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలపై వినియోగదారుల్లో గందరగోళం నెలకొంది. ఇలానే అక్రమార్కులకు వదిలేస్తారా? ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి సారించి ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రత్యామ్నాయ మార్గాలతో కొనసాగిస్తారా ? అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌లా మారింది. ఇసుక కొరత ఏర్పడితే దానిపై ఆధార పడిన కార్మికులంతా రోడ్డున పడతారు. ఇప్పటికే పలుచోట్ల పనుల్లేక కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని కోరుతున్నారు.

మరో ఆరు రీచ్‌లు మంజూరు

పెదకూరపాడు నియోజకవర్గంలో ఆరు రీచ్‌లు మంజూరయ్యాయి. అమరావతి మండలంలో నాలుగు, అచ్చంపేట మండలంలో రెండింటిని త్వరలో ప్రారంభించబోతున్నాం. ప్రతి రీచ్ దగ్గర స్టాక్ పాయింట్ పెడతాం. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా నాణ్యమైన ఇసుక సరఫరా చేస్తాం. ఇందులో భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు.

– జి.శ్రీనివాసరావు, తహసీల్దారు, అచ్చంపేట

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీల్లో వెళ్లారు. కొండలోని మ్యూజియం, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం లాంచీల ద్వారా రూ.90,450 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.

జిల్లాలో ఇసుక కొరత లేదు

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ప్రస్తుతం 16,511 మెట్రిక్ టన్నుల నిల్వ
- త్వరలో అందుబాటులోకి మరో 4.23 లక్షల మెట్రిక్ టన్నులు

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఇసుక కొరతలేదని, అపోహలు నమ్మవద్దని కలెక్టర్ పి. అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలసి కలెక్టరేట్‌లో నూతన ఇసుక విధానంపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారికి రోజుకు సరాసరి 1,000 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఆరు ఇసుక డిపోలు ఉండగా అందులో అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద మాత్రమే 16,511 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. ఇందులో ఈ నెల 7 నుంచి 11 వరకు ముందస్తుగా బుకింగ్ చేసుకున్న వారికి ఐదు వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సిందిపోగా 11,511 మెట్రిక్ టన్నుల మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. వెబ్‌సైట్ ద్వారా ప్రజలు నేరుగా లేదా సంబంధిత సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉచిత ఇసుక పొందవచ్చని ఆయన సూచించారు. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలతో స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లవద్దని, ఇసుక కొరత పుకార్లు నమ్మి దళారుల వద్ద అధిక ధరలకు కొనవద్దని విజ్ఞప్తి చేశారు. అక్టోబరు 16 నుంచి జిల్లాలోని ఆరు ఇసుక రీచ్‌లలో 4,23,300 మెట్రిక్ టన్నుల తవ్వకాలకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి, స్టాక్ పాయింట్ల వరకూ తరలించేందుకు టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబరు 20 నాటికి ఆరు రీచ్‌లలో ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని కలెక్టర్ చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు వస్తే మరో 5,29,050 మెట్రిక్ టన్నులు తవ్వకానికి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.



సమావేశంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఖర్చులు భరించాలి

ఆన్‌లైన్ లేదా సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తున్నామని, అయితే రవాణా ఖర్చులు భరించాలని కలెక్టర్ చెప్పారు. ఇసుక అక్రమాలు అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ నుంచి 1800 425 6029 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఇసుక అక్రమాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా నిల్వచేసి అధిక ధరలకు అమ్ముకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తు అనుమతి తీసుకున్న వాహనాలకు మాత్రమే రీచ్‌ల వద్దకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగయ్య, దాచేపల్లి మైన్స్ ఏడీ ప్రకాశ్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా టెట్ పరీక్ష

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేటలో ఏపీ టెట్–2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ అటానమస్ బ్లాక్ 4 మూడు కేంద్రాలలో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఆయా కేంద్రాలలో 1173 మంది అభ్యర్థులకుగాను 973 మంది హాజరయ్యారు. మరో 200 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.

కోర్టుకు హాజరు కాని నిందితుడి అరెస్ట్

పిడుగురాళ్ల: కోర్టు వారెంట్ నిందితుడిని అదుపులోకి తీసుకొని గురజాల కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ ఎస్ఐ ఎం.మోహన్ ఆదివారం తెలిపారు. వివరాలు.. 2014లో పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద మేరిమేత విగ్రహం సమీపంలో శ్రీను అనే వ్యక్తిని మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కొచ్చర్ల అశోక్ పెట్రోల్ పోసి హత్య చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో అశోక్ రెండేళ్ల పాటు కోర్టుకు హాజరయ్యాడు. ఆ తర్వాత కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవటంతో కోర్టు వారెంట్ జారీ చేసింది. దీంతో అప్రమత్తమైన పట్టణ ఎస్ఐ, పిడుగురాళ్ల పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అశోక్‌ను అదుపులోకి తీసుకొని గురజాల కోర్టుకు అప్పగించటంతో సబ్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌యూ న్యాయ సలహాదారుగా నర్రా



నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం న్యాయ సలహాదారుడిగా హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఏఎన్‌యూ నుంచి లా పట్టా పొందారు. మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన ఆయన ఏడాది పాటూ న్యాయ సలహాదారుడిగా కొనసాగనున్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గంగాధరరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సింహాచలం నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందించారు.

166 గ్రాముల బంగారం మాయం

పెదకాకాని: ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీనివాస టవర్స్ అపార్ట్‌మెంట్‌లో బంగారం మాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు శివార్లలోని అపార్ట్‌మెంట్ ప్లాట్‌లో ఎస్‌కె సాదిక్ అలీ కుటుంబం నివాసం ఉంటోంది. నెల కిందట సుమారు 166 గ్రాముల బంగారు నగలను బీరువాలోని లాకర్‌లో పెట్టి లాక్ వేశారు. ఆదివారం లాకర్ తీసి చూడగా బంగారం లేదు. దీనిపై పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఓటుకే భద్రత లేదు!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తంతు ప్రహసనంలా మారింది. ఈ జాబితాలో పేరు ఉండాలంటే ప్రతిసారి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని చెబుతుండడం అందరికీ ఇబ్బంది అవుతోంది. వచ్చే ఏడాది మార్చిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తాజాగా షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, గతంలో ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రుల జాబితా లేదని, మళ్లీ కొత్తగా నమోదుకు చర్యలు చేపట్టింది.



- ఎన్నికొచ్చిన ప్రతిసారీ తప్పని నమోదు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్
- సెప్టెంబర్ 30 నుంచి కొత్త ఓటర్ల నమోదు
- శాశ్వత జాబితా రూపకల్పనకు డిమాండ్

కొరిటిపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని అర్హులైన పట్టభద్రులంతా సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో తమ ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ ఎన్నికలు జరిగే ప్రతిసారీ ఇలా ఓటు హక్కు నమోదు చేసుకోవాలంటే ఎలా అంటూ ఓటర్లు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినా.. పట్టభద్రులైతే చాలు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఎమ్మెల్సీకి పోటీ చేసే అభ్యర్థికి తొలి, ద్వితీయ, తృతీయ ప్రాధాన్య ఓట్ల ద్వారా కనీసం 50 శాతంపై అనుకూలంగా పడితేనే విజయం వరిస్తుంది.

3 లక్షలు దాటే అవకాశం

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 2019 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,48,799 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో కేవలం 1,14,325 (45.79 శాతం) మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మార్చి 2025లో జరిగే పట్టభద్రుల ఎన్నికలకు సుమారు 3 లక్షల మందికిపైగా నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నమోదు నిబంధనలు ఇవీ..

- ఈ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల పరిధిలో ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు మళ్లీ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి.
- ఫాం 18 వినియోగించుకుని దరఖాస్తు అందించాలి.
- సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఉంది.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు నేరుగా ఇంటి చిరునామాకు వచ్చి ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.
- ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి పరిశీలనా ఉండదు.
- ఫాం 18లో వివరాలను తొలుత పూరించాలి. ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ నకలు, నివాస ధ్రువపత్రం సెట్‌గా చేసి మండల తహసీల్దార్, గ్రామ సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో అందించవచ్చు.

హక్కులను హరించినట్టే..



పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారీ ఓటు నమోదు చేయించుకోమనడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు ఇవ్వడమంటే ప్రజల హక్కులను హరించినట్లే. గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసిన వారిని కొత్తగా నమోదు నుంచి మినహాయించాలి.

– తూము వెంకటేశ్వరరెడ్డి, బీకాం, గుంటూరు

పునరాలోచన అవసరం



పట్టభద్రుల ఓటు నమోదును గ్రామ సచివాలయాల్లో చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలి. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఓటు నమోదు పట్టభద్రులను అనుమానించడమేనని భావిస్తున్నాం. దీనిపై ఎన్నికల కమిషన్ పునరాలోచన చేయాలి.

– ఎం.నరేంద్రరెడ్డి, బీఏ, గుంటూరు

ప్రకృతి సాగు పరిశీలించిన విదేశీ బృందం



పెదకూరపాడులో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న విదేశీ బృందం

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను విదేశీ ప్రతినిధి బృందం ఆదివారం సందర్శించింది. పెదకూరపాడులోని సర్వేపల్లి అమూల్య, నందిగం జ్యోత్స్న సాగు చేస్తున్న పత్తి పంటలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు టి.విజయ్ కుమార్, క్రేగ్ కాట్, కీట్ అగోడ(అమెరికా, స్పెయిన్) ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పత్తి పంటలో అంతర పంటలుగా కంది, జొన్న, సజ్జ, గోంగూర, పెసర, దోస, అనుములు వేయడం ద్వారా రైతులకు ప్రతినెల ఆదాయం లభిస్తుందని వివరించారు. పత్తి పంటకు ఖర్చు అంతర పంటల ద్వారా రైతుకు లభిస్తుందని చెప్పారు. చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారితోపాటు కంచర్ల మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జి బ్యూలా, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

మండలంలో..

బెల్లంకొండ: పల్నాడు జిల్లాలోని బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం, రాజుపాలెం మండలంలోని బ్రాహ్మణపల్లి, పెదకూరపాడు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న పంటలను, మోడల్స్, కాంపాక్ట్ బ్లాక్స్‌లను ఆదివారం విదేశీ బృందాలు, రాష్ట్ర అధికారులు పరిశీలించారు. అమెరికా నుండీ పెగాసెస్ క్యాపిటల్ అడ్వైసర్ క్రేగ్ కాట్, కీత్ అగోడ ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈఓ, స్పెయిన్ విదేశీ బృందంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు టి.విజయకుమార్ సందర్శించారు. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారికి ప్రకృతి వ్యవసాయం సార్వత్రిక సూత్రాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ మహిళారైతు కె.జ్యోతి చేపట్టిన నిరంతరం ఆదాయం ఇచ్చే ఏటీఎం మోడల్, సూర్య మండలం మోడళ్లను వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

రొంపిచర్ల: మండలంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై ఆదివారం రాత్రి రెండు చోట్ల చోటుచేసుకున్న ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. అన్నవరప్పాడు గ్రామ సమీపంలో ఆ గ్రామానికి చెందిన వి.బాలయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.. క్షతగాత్రుడు బాలయ్యను 108 వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.. అలాగే రొంపిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. నరసరావుపేట నుంచి ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ రోడ్డు దాటుతుండగా హైదరాబాదు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మరో వ్యక్తికి గాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ కూడా గాయపడింది. ఈ ముగ్గురిని వైద్య సేవ నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడి రోడ్డుపై పడి ఉన్న బాలయ్య

గంజాయి విక్రయం కేసులో ఏడుగురు అరెస్టు

4 కిలోలు గంజాయి, 3 బైక్‌లు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేస్తున్న దృశ్యం

పెదకాకాని: గంజాయిని తరలించి, విక్రయిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండలంలోని నంబూరు యానాదికాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటిలో గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేసి నంబూరు గ్రామానికి చెందిన వాసా రాజేష్, తాడిబోయిన గోపీకృష్ణ, దుర్గపు పవన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా కృష్ణా జిల్లా, ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన అనగాని రాఘవేంద్ర ప్రసాద్, నూజివీడుకు చెందిన తాతా హేమంత్‌కుమార్, విజయవాడ పటమటకు చెందిన పండాలనని వెంకట శివగణేష్‌కుమార్, ప్రతివాడ శివాజీలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 కిలోలు గంజాయి, రెండు బైక్‌లు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం, గంజాయికి బానిసలైన నిందితులు జల్సాలకు అలవాటు పడ్డారని పోలీసులు పేర్కొన్నారు. అక్రమంగా సంపాదించాలనే దురాశలో గంజాయి రవాణా, అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆదివారం కోర్టుకు హాజరు పరచగా, వారికి రిమాండ్ విధించినట్లు సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

వారి మాట విని ఉంటే...

- కృష్ణా నదిలో ముగ్గురు యువకుల బంతి ఆట
- అలా చేయొద్దని ఇరువురు స్థానికుల హెచ్చరిక
- పట్టించుకోకపోవడంతో ఒకరు గల్లంతు



బొడ్డపాటి నరేష్ (ఫైల్)

కొల్లూరు: స్నేహితులతో సరదాగా గడపడానికి కృష్ణా తీరానికి వచ్చిన యువకుడు నదిలో మునిగి గల్లంతైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తెనాలి బీసీ కాలనీకి చెందిన బొడ్డపాటి శ్రీనివాస్ కుమారుడు నరేష్ (20), మరో ఆరుగురు యువకులు కలిసి మండలంలోని చిలుమూరు కృష్ణా నదీ ప్రాంతానికి వచ్చారు. కాసేపు వారు ఒడ్డున సరదాగా గడిపారు. నరేష్ , మరో ఇద్దరు యువకులు నీటిలోకి దిగి బాల్‌తో ఆడటం ప్రారంభించారు. నీటి ప్రవాహానికి బాల్ కొద్ది దూరం కొట్టుకొని వెళ్లడంతో తీసుకొచ్చేందుకు నరేష్ వెళ్లాడు. అక్కడ లోతు అధికంగా ఉండటంతోపాటు నీటి ప్రవాహ వేగం ఎక్కువ కావడంతో నీటిలో మునిగిపోతూ కొట్టుకుపోయాడు. ఇరువురు యువకులు కాపాడేందుకు ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అప్పటికీ ఓ యువకుడు గట్టిగా ప్రయత్నించినా.. తాను నీటిలో మునిగిపోతుండటంతో నరేష్‌ని విడిచి పెట్టాల్సి వచ్చింది. దీంతో నరేష్ గల్లంతయ్యాడు. స్థానికులు మండలంలోని గాజుల్లంకకు చెందిన గజ ఈతగాళ్లకు సమాచారం అందించడంతో వారొచ్చి గాలించినా ఫలితం దక్కలేదు. చీకటి కారణంగా గాలింపు చర్యలు నిలిపివేశారు. సమాచారం అందుకున్న కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు సంఘటనా ప్రాంతానికి చేరుకొని నరేష్ తండ్రి శ్రీనివాస్, ఇతర యువకుల నుంచి సమాచారం సేకరించారు. నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.



గాలిస్తున్న గాజుల్లంకకు చెందిన గజ ఈతగాళ్లు



నరేష్ తండ్రి నుంచి వివరాలు సేకరిస్తున్న కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు

హెచ్చరించినా పెడచెవిన పెట్టిన యువకులు

నదిలో ఆడుతున్న యువకులను పశువులను తోలుకొచ్చిన చిలుమూరుకు చెందిన ఓ వృద్ధుడు, చేపల వేట కోసం వచ్చిన మరో మత్స్యకారుడు హెచ్చరించినప్పటికీ పెడచెవిన పెట్టారు. ప్రవాహ వేగం ఎక్కువగా ఉందని, లోపలకు వెళితే మడుగులు ఉన్నాయని ఇరువురు వ్యక్తులు కేకలు వేసి మరీ హెచ్చరించారు. తమకు ఈత వచ్చునని నరేష్, మరో ఇరువురు చెప్పడంతో వారు మిన్నకుండిపోయారు. వారు హెచ్చరించిన కొద్ది సమయానికే నరేష్ గల్లంతైనట్లు తెలుసుకొన్న మత్స్యకారుడు చేపల వేటకు వినియోగించే వలను వేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తెనాలి రూరల్: తెనాలి మండలం అంగలకుదురు నుండి సంగం జాగర్లమూడి దారిలో గల ఐస్ ఫ్యాక్టరీ వెనుక వైపున తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించారు. 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం నిమ్మ చెట్టు వద్ద ఉరి వేసిన స్థితిలో కిందకు జారిపడి ఉంది. రైతులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు టీషర్టు, ప్యాంట్ ఉన్నాయి. ఇతర ఆధారాలు లభించలేదు. రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు హైవే దొంగల అరెస్టు



వేటపాలెం: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను ఆపి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఆదివారం చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు. పొన్నూరుకు చెందిన షేక్ మదర్ అలియాస్ హేనీ, ఇతనిపై 26 కేసులు, ఒంగోలుకు చెందిన దేవరకొండ మదన్‌సాయిపై రెండు కేసులు, బాపట్లకు చెందిన ఆనంద్ బాబు అలియాస్ నానిపై 11 కేసులు, బాపట్లకు చెందిన శీలం వంశీకృష్ణ రెండు కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరితోపాటు బాపట్లకు చెందిన షేక్ సైదా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇతనిపై ఇప్పటికే 15 కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. వీరందరూ కలిసి కత్తిపూడి–ఒంగోలు జాతీయ రాహదారిపై వెళ్లే బైక్‌లను ఆపి నిలువు దోపిడీకి పాల్పడేవారు.

ద్విచక్ర వాహనాలే టార్గెట్..

ఈ ఐదుగురు యువకులు కలిసి రాత్రి వేళల్లో హైవేపై ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని ఆపి వారి వద్ద ఉన్న నగదు, సెల్ ఫోన్‌లు, వారి బైక్‌లను దొంగిలించే వారని తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీన నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన పెద్దపూడి షాలేం రాజు తన తల్లిని చీరాల నుంచి గ్రామానికి తీసుకురావడానికి అదే రోజు రాత్రి తన బైక్‌పై వస్తున్నాడు. పందిళ్లపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్ వద్దకు రాగానే ఈ ఐదుగురు షాలెం రాజును అడ్డుకొని బెదిరించి సెల్‌ఫోన్, రూ.4 వేల నగదు, బైక్ లాక్కొని వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి షాలెం రాజు వేటపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు దర్యాప్తు చేశారు. ఈ కేసుపై చీరాల రూరల్ సీఐ పీ శేషగిరిరావు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి వేటపాలెం బైపాస్ రోడ్డులో గాయిత్రి బిర్యానీ పాయింట్ వద్ద నాలుగు మోటార్ బైక్‌లు ఆపి నిందితులు మాట్లాడుకొంటున్నారు. అప్పుడే అటుగా వచ్చిన పోలీసు జీపును చూసి నలుగురు పారిపోవడానికి ప్రయత్నించినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని వెంబడించి పట్టుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఐదుగురిపై వివిధ పోలీసుస్టేషన్‌లలో ఉన్న కేసులపై గతంలో జైలుకు వెళ్లి వచ్చారని తెలిపారు. వీరి వద్ద నుంచి 22 సెల్‌ఫోన్‌లు, ఐదు మోటార్ బైక్‌లు, ఒక ట్యాబ్, రూ. 4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ రూ.4.13 లక్షలు అని తెలిపారు. కేసును అతి త్వరగా ఛేదించిన రూరల్ సీఐ, ఎస్ఐ సిబ్బందిని అభినందించారు.

సాగర్ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామ సమీపంలోని సాగర్ ప్రధానకాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం కొట్టుకొచ్చినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. కొట్టుకొచ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు.. కెనాల్ సమీపంలోని రైతులు అందజేసిన సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పవర్‌ప్లాంట్ సమీపంలో అతికష్టం మీద మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి శరీరం మొత్తం గుర్తుతెలియని విధంగా పాడైపోయి ఉంది. వయస్సు 30–45 ఏళ్ల మధ్యలో ఉండి బట్టతల కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్కైబ్లూకలర్ నిండుచేతుల చొక్కా, నలుపురంగు ప్యాంటు, ఎరుపురంగు మొలత్రాడు శరీరంపై ధరించి ఉన్నట్లు వివరించారు. సమాచారం తెలిపిన వారు నకరికల్లు పోలీస్‌స్టేషన్‌కు 94407 96246 నంబరు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పేకాట క్లబ్‌లు మూత

ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

లక్ష్మీపురం: గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్, గుంటూరు క్లబ్‌లు ఆదివారం నుంచి పూర్తిగా మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే మూతపడ్డ పేకాట క్లబ్‌లు మరలా తెరుచుకున్న విషయం విదితమే. పాలకొల్లులో పేకాటలో అప్పుల పాలైన వ్యక్తి సోషల్ మీడియా వేదికగా ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కొవ్వూరు లిటరరీ పేకాట క్లబ్ పై ప్రత్యేక పోలీస్ బృందాల దాడి చేయడంతో వారి నుంచి తప్పించుకునే క్రమంలో క్లబ్ నిర్వాహకులు పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. క్లబ్ పైఅంతస్తులో రమ్మి ఆడుతున్న వారిపై దాడి చేసే క్రమంలో కొంత మంది పరారయ్యారు. వారిలో ఒక వ్యక్తి మాత్రం భవనం పైనుంచి కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. అదే క్లబ్‌లో పనిచేసే మరో ఉద్యోగికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేకాట క్లబ్‌లు మూసి వేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తుంది.

డాక్టర్ శేషాద్రి శేఖర్ సేవలు ఎనలేనివి



డాక్టర్ శేషాద్రి శేఖర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: పేదలకు న్యూరోసర్జన్‌గా డాక్టర్ శేషాద్రి శేఖర్ చేసిన సేవలు ఎనలేనివని పలువురు వైద్యులు ప్రశంసించారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరో సర్జన్‌గా 18 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి గత నెల 30న ఒంగోలు జీజీహెచ్‌లో ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ శేషాద్రి శేఖర్‌కు ఆదివారం ఘన సన్మానం జరిగింది. గుంటూరులోని వెల్‌కమ్ హోటల్‌లో బ్రింద హాస్పటల్ అధినేత, బాహుబలి సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటైంది. గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు హాజరయ్యారు. డాక్టర్ శేషాద్రి శేఖర్ చేతుల మీదుగా పీజీ వైద్య విద్య పట్టాలు అందుకున్న పలు రాష్ట్రాలకు చెందిన న్యూరోసర్జన్లు కూడా వచ్చారు. డాక్టర్ శేషాద్రి శేఖర్ అంకితభావంతో పేదలకు సేవలు చేశారని పలువురు వక్తలు అభినందించారు. సినీగేయ రచయితలతో ప్రత్యేకంగా రాయించిన గురుభక్తి తెలిపే పాటను ప్రదర్శించి పూర్వ వైద్య విద్యార్థులు తమ అభిమానం చాటారు. అనంతరం శేషాద్రి శేఖర్ దంపతులను గజమాలతో సత్కరించారు. మచిలీపట్నం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, జీజీహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణమూర్తి, గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ వి.రామ్‌తారక్‌నాథ్, న్యూరో సర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ పెంచలయ్య, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

పలువురికి పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: ఉపాధ్యాయులే భావిభారతావనికి మార్గదర్శకులని వారణాశి రఘురామశర్మ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు, మైనంపాటి వీరరాఘవశర్మ మెమోరియల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అద్దంకిలోని మారంవారి సేవాసదన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రఘురామశర్మ అధ్యక్షత వహించి ఉపాధ్యాయుల పాత్ర, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యనే కాక, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా బోధిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. డాక్టర్ యు.దేవపాలన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్పు తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. వారు విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారాలు ఇవ్వడం ఎంతో గర్వకారణమని చెప్పారు. మల్లాది శ్రీనివాసరావు, పురస్కార ప్రదాత శ్రీరామచంద్రమూర్తి మాట్లాడారు.

పురస్కార ఉపాధ్యాయులు వీరే..

కార్యక్రమంలో తవనం వెంకటరావు, డీవీఎం ఎం సత్యనారాయణ వేములకొండ హనుమంతరావు, గుడిపూడి అంజయ్య, యర్రమోతు వీరస్వామి, నిమ్మరాజు నాగేశ్వరరావులకు పురస్కారం, నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, జమ్మలమడక హనుమంతరావు, మంచికలపాటి రాధాకృష్ణమూర్తి, ఆర్వీ రాఘవరావు, చుండూరి మురళీసుధాకరరావు, కేవీ పోలిరెడ్డి, సంకా బాబు, బత్తుల అంజయ్య, కందికట్ల సత్యం, మహమ్మద్ రఫీ, భువనేశ్వరి, జె.ప్రతాప్, గోపినాథం హరనాథ్, పుట్టంరాజు పట్టాభి రామారావు, పీఎల్వీ నరసింహారావు, మిట్టా కామేశ్వరశర్మ, బాలు ఆర్టిస్టు, కోటయ్య, ఇలపావులూరి శేషతల్పశాయి పాల్గొన్నారు.